క్లుప్తంగా

వైభవంగా సాయి పల్లకీ సేవ



కల్వకొలను వీధిలో సాయి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పుణ్య తిథి నవరాత్రుల ముగింపు కార్యక్రమంలో భాగంగా సాయి పల్లకీ సేవ, అన్న సమారాధన కార్యక్రమాలు గురువారం వైభవంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా దసరా రోజున సమాధి అయిన రోజును పుణ్య తిథిగా భక్తులు కొలుస్తారు. సాయిబాబా పుణ్య తిథిని పురస్కరించుకుని కల్వకొలనువీధి బాబా ఆలయంలో ఏటా నవరాత్ర ఉత్సవాలు జరుగుతాయి. సాయి పల్లకీని భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, ఆలయ ప్రతినిధులు వర్రే శేషు, బెజవాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శ



రామ సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొంతు రామ సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సూర్యనారాయణ కుమారులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ వారి నివాసంలో గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామసూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బొంతు సత్యనారాయణ, బాబురావు, కదలి వీరన్న, బొంతు రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

కాట్రేనికోన: అర్హత ఉన్న యువతీ యువకులందరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ పేర్కొన్నారు. కాట్రేనికోన స్థానిక సిద్ధార్థ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ కొంకి రవి అధ్యక్షతన గురువారం ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ 16 ఏళ్లు నిండిన యువత ఫారం–6 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాగరాజు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వారికి అత్యుత్తమ సేవలు అందించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బెండమూర్లంక పీహెచ్‌సీలో గురువారం ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి చైర్మన్ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. హెచ్‌డీఎస్ నిధులు వెచ్చించి అభివృద్ధి చేయాలన్నారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు జరిగాలని, ఆ దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన కంప్యూటర్లు, ఇతర పరికరాలు సమకూర్చుతానని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బాల సుబ్రహ్మణ్యం, సర్పంచ్ బర్రే సీతారత్నం, ఎంపీడీఓ కృష్ణమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల ప్రారంభం

తాళ్లరేవు: శ్యామల విజయ్ ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాలుగు ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌పోర్టు అధినేత ఉల్లింగి విజయ్‌బాబు, చెల్లి వివేకానంద, వాసంశెట్టి శ్రీనివాస్, జక్కల ప్రసాద్, కుడుపూడి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరగని చరిత్ర.. మిగిలిన జ్ఞాపకం

- శిథిల స్థితిలో ఫ్రెంచి కాలం నాటి సబ్‌కోర్టు భవనం
- 1725లో డచ్చివారి నిర్మాణం.. ఆపై ఫ్రెంచి కోర్టుగా రూపాంతరం
- చారిత్రాత్మక కేసులకు సాక్షిగా నిలిచిన వైనం



ఫ్రెంచి కాలం నాటి యానాం సబ్‌కోర్టు భవనం

యానాం: సరిగ్గా 300 ఏళ్ల చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన యానాం సబ్‌కోర్టు భవనం ఇక జ్ఞాపకంగా మిగిలిపోనుంది. 1725లో డచ్చివారి సారథ్యంలో నిర్మితమైన ఈ భవనం ఫ్రెంచివారి అధీనంలో సబ్‌కోర్టు భవనంగా రూపాంతరం చెందింది. నాటి నుంచి వందలాది ఏళ్లుగా అనేక కీలక కేసుల విచారణకు సాక్షిగా నిలిచింది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షాలు వచ్చినపుడు శ్లాబ్ నుంచి నీరు కారి కోర్టులో విచారణలకు పదే పదే ఆటంకం కలగడంతో పాటు అక్కడి ఫైళ్లన్నీ తడిసిపోతున్నాయి. పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఏడాది క్రితమే పీడబ్ల్యూడీ శాఖ అధికారులు భారీగా ఖర్చు చేసి భవనానికి మరమ్మతులు చేసినా ఉపయోగం లేకపోయింది. ఏ క్షణంలో భవనం కూలిపోతుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలోనే న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తి ఇటీవల సబ్‌కోర్టును పరిశీలించి తరలింపునకు ఆదేశించారు. కొద్దిరోజుల్లోనే సబ్‌కోర్టును తాత్కాలికంగా మున్సిపల్ కల్యాణ మండపంలోకి తరలించనున్నారు. ప్రస్తుతమున్న సబ్‌కోర్టును పడగొట్టి నూతన భవనాన్ని నిర్మించే యోచనలో అధికార యంత్రాంగం ఉన్నట్లుగా తెలుస్తుంది.

అప్పటి నుంచే స్థానిక జడ్జీల నియామకం

1701లో ఫ్రాన్స్‌లో జారీ చేసిన రాజ శాసనం ద్వారా పాండిచ్చేరిలో గవర్నర్ కౌన్సిల్‌కు సంపూర్ణ జ్యుడీషియల్ హక్కులు కల్పించారు. ఆ విధంగా 1766 నుంచి 1827 వరకూ చాద్రిల పేరుతో ఫ్రెంచి జడ్జిలు విచారణ చేసి తీర్పులు ఇచ్చేవారు. అయితే 1735లో ఫ్రెంచి ప్రభుత్వం ఒక కమిటీ వేసి శిక్షా స్మృతులను అధ్యయనం చేయించింది. 1819 నవంబర్ 22న మళ్లీ జారీ చేసిన ఒక రాజ శాసనం ద్వారా ఫ్రెంచి ఇండియా కాలనీల్లో మెజిస్ట్రేట్ కోర్టులు ప్రారంభించారు. ఆ సమయంలోనే యానాంలోనూ కోర్టు ఏర్పాటుచేశారు. యానాం చిన్న ప్రాంతం కావడంతో సివిల్, క్రిమినల్, శాంతి భద్రతల వ్యవహారాలన్నింటికీ కలిపి ఒకే జడ్జి ఉండేవారు. మొదట్లో యానాం పెద్దొరే(అడ్మినిస్ట్రేటర్) జడ్జిగా వ్యవహరించేవారు. 1833 ఫిబ్రవరి 4న జారీ చేసిన డిక్రీ ద్వారా యానాంకు ప్రత్యేక జడ్జిని నియమించారు. ముందులో క్రిమినల్ కేసుల విచారణలో ముగ్గురు, నలుగురు ఫ్రెంచి దేశస్తుల సమక్షంలో విచారణ చేసేవారు. అనంతరం స్థానిక తెలుగు పెద్దలను భాగస్వాములను చేసి స్థానిక జడ్జిలను నియమించేవారు. ఆవిధంగా కామిశెట్టి పేరమ, బళ్ల సుబ్బయ్య, బులుసు సుబ్రహ్మణ్యశాస్త్రులు, బెజవాడ బాపనయ్య, వర్ధినీడి అయ్యప్పనాయుడు, గిరి వెంకన్న, దరియాఖాన్, కాపగంటి పెదమంగరాజు, బొల్లోజు బసవలింగం, షేక్ లాలా, కామాడి మీరయ్య, ఎర్రగుంట వెంకన్న వంటి స్థానికులు సహాయ జడ్జిలుగా పనిచేశారు.

మన్యవారి మేడలో మానవ బలికేసు

యానాం సబ్‌కోర్టులో ఎన్నో ప్రసిద్ధిగాంచిన కేసుల విచారణ సాగింది. దాంట్లో మన్యవారి మేడలో మానవ బలికేసు ప్రధానమైనది. ఈ కేసును పాండిచ్చేరి కోర్టు ప్రధానన్యాయమూర్తి రిస్టేలే హేబర్ నవంబరు 17, 1858లో విచారించారు. యానాంలో పేరు మోసిన జమీందారు మన్యం వెంకటరత్నం 1856లో అనారోగ్యం బారిన పడటంతో మంత్రగాళ్లను ఆశ్రయించి వారి సలహాతో మానవ కన్యను బలి ఇవ్వడానికి సిద్ధపడ్డారని ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఈ కేసును విచారించిన జడ్జి ది సెయింట్ హెల్‌లెర్ కేసును కొట్టివేశారు. అలాగే తొలితరం ఆధునిక తెలుగు కవి చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి యానాంలో 1880లో విద్యాభ్యాసం చేశారు. అయితే చెళ్లపిళ్లవారు అల్లే కవిత్వంలో తమ గురించి దూషణలు ఉన్నాయని కొంతమంది స్థానికులు యానాం కోర్టులో కేసు వేశారు. కేసు విచారించిన జడ్జి గారు నూనూగు మీసాలైన లేని చెళ్లపిళ్ల వారిని చూసి వీడు పొయెట్ అంటే నేను ఒప్పుకోను అని కేసును కొట్టివేశారట. తరువాత కాలంలో చెళ్లపిళ్ల వారు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ కవిగా పేరుగాంచారు. ఆఖరికి ఫ్రెంచి పాలన నుంచి యానాం విముక్తికి సైతం స్థానిక జడ్జి పాత్ర ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు.

వందల ఏళ్ల చరిత్ర



యానాం సబ్‌కోర్టుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో జడ్జి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, నోటరీ వంటి ప్రధాన పదవుల్లో ఫ్రెంచి దేశస్తులే ఉండేవారు. కాలక్రమంలో స్థానికులే జడ్జిలుగా నియమితులయ్యారు. చరిత్రలో పేరు గాంచిన ఎన్నో కీలకమైన కేసుల విచారణకు యానాం సబ్‌కోర్టు సాక్షిగా నిలిచింది.

– బొల్లోజు బాబా, చరిత్రకారుడు, యానాం

హామీలు నెరవేర్చాలంటూ గ్రామస్తుల ఆందోళన



గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్ దివాకర్

ఉప్పలగుప్తం: మండలంలోని స్థానిక గ్రామ పంచాయతీ పరిధి ఏటిమెరక ప్రాంతంలో గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ స్థానికులు ఓఎన్‌జీసీ రిగ్‌కు వెళ్లే మార్గంలో గురువారం టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. తమ ప్రాంతం నుంచి చమురు సంస్థలు చమురు తీసుకుపోవడమే తప్ప అభివృద్ధి చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ధర్నా చేసినపుడు గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.23.50 లక్షల సీఎస్‌ఆర్ నిధులను కేటాయిస్తున్నట్లు ఓఎన్‌జీసీ అధికారులు ప్రకటించారన్నారు. కాని నిధులు పూర్తి స్థాయిలో మంజూరు కాక గ్రామంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని, అందుకే మళ్లీ ఆందోళన చేపట్టామన్నారు. దీంతో తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఎస్‌ఐ సీహెచ్ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఓఎన్‌జీసీ అధికారులు, ఆందోళనకారులతో చర్చలు జరిపారు. 20 రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు చేయిస్తామని సర్పంచ్ చిన్నవరాజు సమక్షంలో ఓఎన్‌జీసీ అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కొనసాగుతున్న ఎన్‌ఎంఆర్‌ల నిరసన



పీడబ్ల్యూడీ ఆఫీస్ వద్ద ఎన్‌ఎంఆర్‌ల ధర్నా

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ శాఖలో పని చేస్తున్న ఎన్‌ఎంఆర్‌లు తమ డిమాండ్ల సాధన కోసం విధులు బహిష్కరించి గత కొద్దిరోజులుగా చేస్తున్న నిరసన గురువారం సైతం కొనసాగింది. స్థానిక పీడబ్ల్యూడీ శాఖ కార్యాలయం ఎదుట వారు చేస్తున్న ధర్నాకు సీఐటీయూ యానాం శాఖ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నేత ఇళ్ల వాసు తదితరులతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ చర్చించారు. రూ.10 వేల వేతనంతో పనిచేస్తున్న తమకు రూ.18 వేలు వేతనాన్ని అందిస్తామని సీఎం రంగసామి రెండేళ్ల క్రితం అసెంబ్లీలో ప్రకటించారని, అయితే ఇప్పటివరకూ అమలు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాల్సి ఉన్నా పుదుచ్చేరి ప్రభుత్వం మాత్రం పెంచిన జీతాలను కూడా ఇవ్వడం లేదన్నారు. ఎన్‌ఎంఆర్‌లను ఎంటీఎస్ అసిస్టెంట్లుగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తోట రాజు, కర్రి నాగబాబు, కలిదిండి అచ్యుత రామరాజు, కాలాడి నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాస్, చీకట్ల శ్రీనివాస్, మన్నే మురళి, పంపన అప్పన్నబాబు, దయానంద స్వామి, కె.వెంకటాచలం, దడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న చల్లపల్లి గ్రామస్తులు

అమలాపురం రూరల్: ఓఎన్‌జీసీ హెవీ లోడ్ ట్యాంకర్ల కారణంగా చల్లపల్లి గ్రామంలో రోడ్డు శిథిలావస్థకు చేరిందని, అక్కడ రోడ్డు నిర్మించాలని కోరుతూ కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సర్పంచ్ ఇసుకుపట్ల జయమణి, ఇసుకపట్ల గోలకోటి చిన్న తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామస్తులు చల్లపల్లిలో బారికేడ్ వేసి ఆయిల్ ట్యాంకర్లను నిలిపివేసి ఆందోళన చేశారన్నారు. అప్పట్లో ఓఎన్‌జీసీ అధికారులు వచ్చి వారం రోజుల్లోగా గుంతలు పూడ్చుతామని, ఐదు కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే ఎనిమిది నెలలు గడుస్తున్నా పనులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ నెలాఖరు నాటికి రోడ్డు వేయకపోతే ఓఎన్‌జీసీ వాహనాలను అడ్డుకుంటామన్నారు.

8077 సమస్యల పరిష్కారం



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న న్యాయస్థానం చైర్మన్ సత్యనారాయణ తదితరులు

అమలాపురం రూరల్: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకూ 11 జిల్లాల పరిధిలో 8077 విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించినట్లు విశాఖపట్టణం ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఈదరపల్లిలో డివిజనల్ కార్యాలయంలో గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత న్యాయమూర్తి, చైర్మన్ సత్యనారాయణ, న్యాయస్థానం సభ్యులు షేక్ బాబర్, మసిలామని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో న్యాయస్థానం చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ 2024లో ఇప్పటివరకూ 395 ఫిర్యాదులు అందగా 315 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులు, ఉద్యోగులకు 107 కేసుల్లో రూ.14.26 లక్షలు జరిమానాగా విధించామన్నారు. విద్యుత్ వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సదస్సులో ఎంఎస్‌ఈ రాజబాబు, ఈఈలు మోకా రవికుమార్, విజయానంద్, ఏడీఏ అన్నవరం, ఏఈలు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలపై సమావేశం

యానాం: నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై సీఎం రంగసామితో గురువారం సమావేశమై చర్చించినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, మాస్టర్ ప్లాన్, మత్స్యకారుల ఓఎన్‌జీసీ నష్టపరిహారానికి సంబంధించిన సమస్యలపై సీఎం రంగసామితో మాట్లాడానన్నారు. పర్మినెంట్ అయిన 25 మంది ఉద్యోగులను పుదుచ్చేరికి బదిలీ చేశారని, వారికి తిరిగి యానాంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరానన్నారు. సమావేశంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారన్నారు.

చొల్లంగిపేట ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



చొల్లంగిపేటలో విచారణ నిర్వహిస్తున్న డ్వామా ఏపీడీ వసంత మాధవి

తాళ్లరేవు: చొల్లంగిపేట ఫీల్డ్ అసిస్టెంట్ కె.జ్యోతి పని తీరుపై సర్పంచ్ కందెళ్ల గంగాభవాని, పలువురు ఉపాధి కూలీలు ఇచ్చిన ఫిర్యాదుపై డ్వామా ఏపీడీ వసంత మాధవి గురువారం విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ విచారణకు సర్పంచ్ కందెళ్ల గంగాభవాని, వార్డు సభ్యుడు కందెళ్ల గంగబాబు, ఉపాధి మేట్లు, కూలీలు హాజరయ్యారు. పలు అంశాలపై విచారణ నిర్వహిస్తుండగా పలువురు నాయకులు, కూలీలు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఏపీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామ సభను తనకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించారని, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి తనకు కనీస గౌరవం ఇవ్వడం లేదని సర్పంచ్ గంగాభవాని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జ్యోతి సమాధానమిస్తూ డీఆర్పీ ద్వారా తెలియజేశానన్నారు. తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడం లేదని, భార్యాభర్తలు ఇద్దరూ వస్తే తప్ప పనిలోనికి రానివ్వడం లేదని, జాబ్ కార్డులు ఇవ్వడం లేదని వేతనదారులు గంజా మంగ, మేడిశెట్టి శ్రీశాంతి, అప్పాయమ్మ తదితరులు వాపోయారు. దీనిపై ఏపీడీ స్పందిస్తూ కూలీల పట్ల మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా హౌసింగ్ లోనుకు సంబంధించి తన నుంచి రూ.18,500 కట్టించుకుని ఆ నగదుకు సమాధానం చెప్పడం లేదని శెట్టి వీరలక్ష్మి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ నగదుకు సంబంధించి బాధితులకు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. తమకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ నిర్వహించి పైఅధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఏపీడీ వసంత మాధవి విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ తేజస్వి, మాజీ సర్పంచ్ మైదు హరిబాబు, మందాల సత్తిబాబు, టేకుమూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి సొమ్ము రూ.9 లక్షల స్వాహా

అమలాపురం రూరల్: పాలగుమ్మిలో డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.9 లక్షల స్త్రీనిధి సొమ్మును ఇద్దరు వీవోఏలు స్వాహా చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. గ్రామంలో పేమెంట్ల రికవరీ సక్రమంగా జరగకపోవడంతో స్త్రీనిధి అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ యానిమేటర్లుగా లావణ్య, కనకమహాలక్ష్మి పనిచేస్తున్నారు. తీసుకున్న రుణాలను మహిళా సంఘాలు తిరిగి చెల్లిస్తున్నా బ్యాంకుకు చెల్లించకపోవడంతో డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఇటీవల స్త్రీనిధి బ్యాంకు మేనేజర్ అనీష్ విచారణ జరపగా, అప్పటికే రూ.9 లక్షల మేర అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. స్వాహా చేసిన సొమ్ము తిరిగి చెల్లిస్తామని గ్రామస్తుల సమక్షంలో యానిమేటర్లు చెప్పారు. దాంట్లో సుమారు రూ.4 లక్షల మేర తిగిరి జమ చేసినట్టు ఏజీఎం ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఇంకా విచారణ పూర్తి కాలేదని డ్వాక్రా సంఘాల వారీగా స్త్రీనిధికి జమ చేసిన మొత్తాలపై విచారించాల్సి ఉందని ఆమె తెలిపారు. అయితే మొత్తానికి రూ.15 లక్షల మేర స్త్రీనిధి సొమ్మును యానిమేటర్లు స్వాహా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప కలశ పూజ



అయ్యప్పస్వామి కలశపూజ నిర్వహిస్తున్న రమేష్ స్వామి భక్త బృందం

ముమ్మిడివరం: నగర పంచాయతీ గొల్లల వీధి బుధవారం రాత్రి అయ్యప్పస్వామి శరణ ఘోషతో మారు మోగింది. వందలాది మంది అయ్యప్ప భక్తులు స్వామివారి కలశ పూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. గ్రామానికి చెందిన అన్నబత్తుల రాజా రమేష్ స్వామి 25వ సారి శబరిమల మాలధారణ సందర్భంగా 18 కలశాలతో అయ్యప్ప పూజను నిర్వహించారు. ఉదయం స్వాములకు అన్న సమారాధన(భిక్ష) చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అయ్యప్ప భక్తులు పేట తుళ్లై ఆడుతూ స్థానిక పంట కాలువలో పవిత్ర జలాలను కలశాలతో తీసుకొచ్చి కలశపూజ, పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం గురుస్వామి మానేపల్లి ప్రకాష్ బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలి



సదస్సులో మట్లాడుతున్న భారత్ అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ పావని

అమలాపురం రూరల్: దేశాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలని ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ఉన్నత భారత్ అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ పావని అన్నారు. మండలంలోని భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉన్నత భారత అభియాన్ గ్రామీణ భారత్ అభివృద్ధిపై వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా రీజినల్ కోఆర్డినేటర్ పావని హాజరై మాట్లాడారు. సమీప గ్రామాల్లో ఉండే విద్యార్థులు అక్కడ సమస్యలను విశ్లేషించి పరిష్కారాన్ని చూపించాలన్నదే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీఎస్ మదన్, ఏవో జక్కం కృష్ణారావు, భారత అభియాన్ కోఆర్డినేటర్ మూర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ

ముమ్మిడివరం: స్థానిక భవిత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు గురువారం పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నగర పంచాయతీ శివారు రాజుపాలేనికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పితాని వీర వెంకట సత్యనారాయణ ఆర్థిక సహాయంతో 33 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందజేస్తున్న సత్యనారాయణ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అల్లవరం: రోడ్డు విస్తరణ నేపథ్యంలో విద్యుత్ స్తంభాల మార్పు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు. గృహ వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించాలని కోరారు.

జాతీయ పోటీల్లో విజేతగా నిలవాలి



స్కేటింగ్ క్రీడాకారుడు శ్రీధర్‌ను అభినందిస్తున్న రమణబాబు తదితరులు

అమలాపురం టౌన్: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన అమలాపురానికి చెందిన 8వ తరగతి విద్యార్థి కోటుం శ్రీధర్ ఆ పోటీల్లో విజేతగా నిలిచి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు ఆకాంక్షించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పలు పోటీల్లో పతకాలు సాధించిన శ్రీధర్‌ను జాతీయ స్థాయి క్రీడాకారుడిగా తీర్చదిద్దడంలో అతడి తండ్రి కేఎస్ మూర్తి ప్రోత్సాహం ఎనలేనిదన్నారు. అమలాపురంలో రమణబాబుతో పాటు ఉప్పలగుప్తం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు శ్రీధర్‌ను గురువారం అభినందించారు.

విలసవిల్లిలో గ్రామ సభ



విలసవిల్లిలో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ దివాకర్

ఉప్పలగుప్తం: గతంలో జరిగిన రీసర్వే అభ్యంతరాలపై మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సలాది ఊర్మిళదేవి అధ్యక్షతన గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీఎస్ దివాకర్‌కు గ్రామస్తులు తమ సమస్యలపై 48 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వీఆర్‌ఓ కె.వెంకటరమణ, మండల సర్వేయర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్



పామును పట్టుకుంటున్న గణేష్ వర్మ

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామ పంచాయతీ పరిధి గుత్తులవారి పాలెం గుబ్బల సుబ్రహ్మణ్యం నివాసంలో గురువారం తాచుపాము హల్‌చల్ చేసింది. వంట గదిలో చొరబడి బుసలు కొడుతున్న పామును సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు గుర్తించి స్నేక్ క్యాచర్ జంపన గణేష్ వర్మకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టుకుని సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

పరుగు పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ప్రశాంతి

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శింగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని రాకుర్తి సిరిసత్య ప్రశాంతి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీల్లో పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిందని పీడీ కామన మధుసూదనరావు తెలిపారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం, 600 మీటర్ల పందెంలో నాలుగో స్థానం సాధించిందని పీడీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రశాంతిని హెచ్ఎం నూకల సత్యనారాయణ, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గుర్లింక సూర్యనారాయణమూర్తి, పీఈటీ కరాటం ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సాగి రాజుకు పరామర్శ



లక్ష్మీకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గంటి హరీష్ మాథూర్

ఐ.పోలవరం: మాతృ వియోగంతో బాధపడుతున్న సాగిరాజు సూరిబాబురాజును గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. సాగిరాజు తల్లి లక్ష్మీకాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తదితరులు ఐ.పోలవరంలోని సాగిరాజు స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నూతన అల్ట్రా డీలక్స్ బస్సు ప్రారంభం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి విజయవాడ రూటులో నూతన అల్ట్రా డీలక్స్ బస్సును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అల్ట్రా డీలక్స్ బస్సులో అమలాపురం నుంచి కేవలం 4.30 గంటల్లో విజయవాడకు వెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, తిక్కిరెడ్డి నేతాజీ, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు ఏడిద శ్రీను, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, విజిలెన్స్ అధికారి రామారావు, గ్యారేజ్ ఇన్‌చార్జి దేవి తదితరులు పాల్గొన్నారు.